

# భూమిపై పెట్టుబడి!

**సినీతారల** తళుకులు కెరీర్ పీక్‌లో ఉన్నంత కాలమే! అందుకే తమ కంటూ గుర్తింపు సంపాదించుకున్నాక వారి సంపాదనలో కొంత మొత్తాన్ని పెట్టుబడిగా మార్చుకుని భవిష్యత్తుని భద్రంగా మలుచుకునే ప్రయత్నం చేస్తారు. అయితే, ఎంత పెట్టుబడి పెడుతున్నామనే దానికంటే ఎక్కడ ఇన్వెస్ట్ చేస్తున్నామన్నదే ముఖ్యం. 'భూమిపై పెట్టుబడి ఎప్పటికైనా లాభదాయకమే' అనేది చాలామంది ఆర్థిక నిపుణులు ఇచ్చే సలహా. అదే బాటలో పయనిస్తున్నారు సినీతారలు. బాలీవుడ్, టాలీవుడ్ తేడాలేకుండా చాలామంది నటీనటులు భూములు కొనుగోలు చేస్తూ స్థిరాస్తులను పెంచుకుంటున్నారు. తాజాగా బాలీవుడ్ భామ కృతీ సనన్ కూడా ఈ జాబితాలో చేరిపోయింది. సౌత్ ముంబయిలోనే ఖరీదైన ప్రాంతంగా పేరొందిన ఆలీబాగ్ టౌన్‌లో 2,000 స్క్వేర్ ఫీట్ ప్లాట్ కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. 'అందమైన డెవలప్‌మెంట్ అయిన సోల్ డే ఆలీబాగ్‌లోని ద హౌజ్ ఆఫ్ అభినందన్ లోధాలో నేను కూడా ఒక గర్వమైన, సంతోషకరమైన ల్యాండ్ ఓనర్ అయ్యాను. భూమి కొనడం అనేది చాలా పెద్ద నిర్ణయం. నేను గత కొన్నాళ్లుగా ఆలీబాగ్‌లో ల్యాండ్ కొనాలని ఆలోచిస్తూ ఉన్నాను. ఇన్నాళ్లకు నా కల నెరవేరింది' అంటూ చెప్పుకొచ్చింది ఈ అందాల భామ. ఇటీవల బాలీవుడ్ బిగ్ బీ అమితాబ్ బచ్చన్ సైతం ఇదే టౌన్‌లో 10,000 చదరపు అడుగుల ప్లాట్ కొనుగోలు చేయడం విశేషం.



# ఆకలి రాజ్యంలో అమ్మ

**ఆకలి** రాజ్యంలో 'కూటి కోసం కూలి కోసం' పాటను గుర్తుకుతెచ్చే విషాద చిత్రమిది. తల్లిమాటను చెవినబెట్టక బయలుదేరిన బాటసారి కాదీమె. కన్నపేగును వీపున మోస్తూ, బతుకు బాధ్యత మోస్తున్న బాటసారి ఆమె. కడుపుకట్టుకుని బతికే పేదరికంలో బిడ్డ భవిష్యత్ కోసం గుండె దిటవు చేసుకుని బతుకుపోరాటంలో గెలుస్తుందో అమ్మ. 'ఎంత కష్టం ఈ పేదతల్లికి' అంటూ లోకం ఆమెకు సంఘీభావం ప్రకటిస్తున్నది. జగదీశ్ భాన్‌ఖోడియా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో జూలై 16 నాటికి 90 మిలియన్ల వీక్షణలు, 7 లక్షల లైక్స్‌తో సోషల్ మీడియాలో నెటిజన్లను ఆకర్షించింది. సోషల్ మీడియాలో మిలియన్ల మంది ప్రశంసలు, అభినందనలు అందుకుంటున్నది. ఆ తల్లి కష్టం తీరాలన్న నెటిజన్ల మాట నిజమవ్వాలని మనమూ కోరుకుందాం.



# మీ వంటింట్లో.. ఇవి ఉన్నాయా?

ఉదయం లేవగానే ఇంటి పనులతోపాటు వంట చేసుకుని పిల్లలకు బాక్సులు కట్టి, ఆఫీస్‌కు క్యారేజీ సిద్ధం చేసుకొని పొలోమని పరిగెత్తడం ఇంటింటా సర్వసాధారణమే! అరగంట ఆలస్యంగా నిద్ర లేచామా.. ఆ రోజు బాక్సులోకి పచ్చడి మెతుకులే గతి! అలాంటి సమయంలో ఇబ్బంది లేకుండా మార్కెట్లోకి వచ్చినవే స్మార్ట్ కిచెన్ గ్యాడ్జెట్స్. తక్కువ టైమ్‌లో ఎక్కువ వంటలు వండి వార్చే ఆ గ్యాడ్జెట్స్ ఏంటో మీరూ ఓ లుక్కేయండి.

## మల్టీ కుక్కర్



ఒక్కో వంటకానికి ఒక్కో కుక్కర్, పాత్రలు వాడే అవసరం లేకుండా అన్నిరకాల వంటల్ని వండేందుకు అనువైనదే ఈ మల్టీ కుక్కర్. ఈ ఒక్క కుక్కర్‌తో అన్నం, ఇడ్లీ, సాంబార్, మ్యాగీ, కూరలు.. ఇలా అన్నిరకాల వంటలు చేసుకోవచ్చు. ఇన్‌బిల్ట్ బౌల్‌తో అందుబాటులో ఉన్న దీన్ని శుభ్రం చేయడం కూడా తేలిక. వర్కింగ్ ఉమెన్స్‌కి, బ్యాచ్‌లర్స్‌కి ఇది బాగా ఉపయోగపడుతుంది.

## పాప్‌కార్న్ మేకర్

చిన్నాపెద్దా తేడా లేకుండా ఎక్కువగా ఇష్టపడే స్నాక్స్‌లో ఒకటి పాప్‌కార్న్. బయటికెళ్తే వందలు పెడితే గానీ గుప్పెడు పాప్‌కార్న్ రాదు. ఈ ఖర్చును నియంత్రించేలా పాప్‌కార్న్ మేకర్ కొంటే సరి. ఏ కల్తీ లేకుండా ఇంట్లోనే పిల్లలకు ఈవినింగ్ స్నాక్స్ నిమిషాల్లో సిద్ధం చేసేయొచ్చు.





## స్టీల్ చాపింగ్ బోర్డ్

వంటింట్లో ఎక్కువగా వాడే వస్తువుల్లో ఒకటి చాప్ బోర్డ్. ఏ వంట చేయాలన్నా ముందుగా కూరగాయలు తరగాల్సిందే. అయితే చెక్కతో చేసిన చాప్ బోర్డ్ తరచుగా తడపడం వల్ల వాసన వస్తుంది. ఇక ఫైబర్, ప్లాస్టిక్ చాప్‌బోర్డ్‌ల వాడకం వల్ల వాటిలోని రేణువులు వంటలో కలిసే అవకాశం ఉంది. ఈ సమస్యలన్నిటికీ స్టీల్ చాపింగ్ బోర్డ్‌తో చెక్ పెట్టేయచ్చు. ఏ చింతా లేకుండా స్టీల్ బోర్డ్‌పై చక్కగా కూరలు తరిగి వంటపాత్రల మాదిరిగానే శుభ్రం చేసి పెట్టుకుంటే సరి.

# నీ బ్లౌజు బంగారం కానూ..!




**బంగారం** పెట్టుకోవడం తెలిసిందే. బంగారు అంచు చీరలు కట్టుకోవడమూ విన్నదే. కానీ ఇప్పుడు కనకపు జాకెట్లు తొడుక్కుంటున్నారు సిరిగల వనితలు. మొన్న అంబానీ ఇంట పెండ్లి వేడుకల్లో పొడచూపిన ఈ వింతలు, కాంతలకు కాంచనంపై ఉండే మక్కువను మిక్కిలి చేసి చూపిస్తున్నాయి. జుట్టుగల అమ్మ ఏ కొప్పయినా వేస్తుంది అన్నట్టు, డబ్బులున్న అమ్మాయి ఏ రవికైనా తొడుగుతుంది అనుకోవచ్చు. కానీ, అందులోనూ ఎన్నో ప్రత్యేకతలు ఉండేలా ఈ జాకెట్లను డిజైనర్లు తీర్చిదిద్దడంతో అవి వార్తల్లో నిలిచాయి. తన తమ్ముడి పెండ్లిలో ఈశా అంబానీ వేసుకున్న రవికను ప్రముఖ డిజైనర్ అబు జానీ సందీప్ ఖోస్లా రూపొందించారు. రకరకాల డిజైన్లలోని చెవి దుద్దులు, లాకెట్లలాంటి వాటిని ఇందులో జోడించారు. కెంపులు, పచ్చలు, వజ్రాలు పొదిగిన ఈ రవిక సిరికి సొగసిరిని జతచేసింది. ఇక, మరో రోజు ఇదే ఈవెంట్‌లో ప్రముఖ నటి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ మరో బంగారు రవికలో మెరిసింది. కాసులు, లక్ష్మీ లాకెట్లు, మామిడిపిందెలు, చిలుకల డిజైన్లు ఇందులో తళుక్కుమన్నాయి. పసిడి టెంపుల్ జువెలరీ మోడళ్లతో దీన్ని అలంకరించారు. ఇక, అంతకుముందు ఒక ఈవెంట్ కోసం అమెరికన్ ఫ్యాషన్ మోడల్ గిగి హదిద్ కూడా అచ్చంగా బంగారు రవికను ధరించింది. కామసూత్ర స్ఫూర్తితో రూపొందించిన ఈ రవికలో దక్షిణ భారత దేశానికి చెందిన టెంపుల్ జువెలరీ డిజైన్లను పొదిగారు. దీన్ని కూడా సందీప్ ఖోస్లానే ముస్తాబు చేశారు. మొత్తానికి బంగారు బ్లౌజు నేటి హాట్ ట్రెండ్ అయిందన్న మాట!



# కబడ్డీ క్వీన్ మాధవి

**కొందరి జీవితాలు నిత్య స్ఫూర్తిమంత్రాలు. ఆడామగా అన్న భేదాన్ని అధిగమించిన విజయ పతాకలు. ముందు మనకు నచ్చింది చేస్తే సమాజమూ మెచ్చుతుందని చేసి చూపించే మార్పు గొంతుకలు. అలాంటి వారిలో 'మాధవి బండారి' కూడా ఒకరు. నలభైయ్యేండ్ల క్రితం ఆడపిల్లలకు కబడ్డీ ఏంటి... అని వింతగా చూసిన సమాజంలోనే తాను కబడ్డీ ప్లేయర్‌నని గర్వంగా చెప్పుకొన్నారామె. జాతీయ స్థాయిలో పతకాలు గెలుచుకోవడమే కాదు, ఆ తర్వాత రాష్ట్ర టీమ్‌కి కోచ్‌గా, ప్రొ కబడ్డీ కమెంటేటర్‌గా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పీఈటీలకు ట్రైనర్‌గా... ఏ పని చేసినా తన సావాసం కబడ్డీతోనే. ఇష్టంగా కష్టపడటమే తన విజయ రహస్యం అంటూ ఆట గురించి ఆమె 'జిందగీ'తో పంచుకున్న మాటలు.**

**ఆట** గురించి చెప్పమంటే ఒకటీ రెండూ విషయాలు కాదు... నా దగ్గర టన్నుల కొద్దీ సంగతులు ఉంటాయి. ఎందుకంటే కబడ్డీ అనేది ఒక పోటీనో, ఒక విజయమో, ఒక పతకమో, ఒక పరాజయమో కాదు. అది నా జీవితం. నాతోపాటే పుట్టి నాతోపాటే పెరిగింది. ఒక రకంగా నా శరీరంలో ఒక భాగం. అందుకే నాకు ఊహ తెలిసిన నాటి నుంచి నేటి వరకూ పెండ్లి, పిల్లలు, ఉద్యోగం, బాధ్యతలు... అన్నిటితోపాటే అదీ ఉంది. దానిలోని ప్రతి అడుగునూ నేను ఆస్వాదిస్తా. పడుతూ లేస్తూ ఆడే ఈ ఆట నన్ను జీవితంలో పడకుండా నిలబెట్టింది. అయితే చిన్నప్పుడు పిల్లలతో కలిసి కబడ్డీ ఆడితేనే మొరటుగా చూసే ఇదే సమాజంలో పెండ్లయి, పిల్లలు పుట్టాక కూడా దాన్ని కొనసాగించగలిగానంటే, అందుకు నా నేపథ్యం, కుటుంబమే కారణం.



### పల్లె నేపథ్యం వల్లే...

మాది యాదగిరిగుట్ట దగ్గరి బీబీనగర్. నాన్న హైదరాబాద్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. నేను మా ఇద్దరు అక్కలు, ఇద్దరు అన్నయ్యలు... అందరం నాయనమ్మ, తాతయ్య దగ్గరే పెరిగాం. ఇంట్లో నేనే చిన్నదాన్ని. పల్లెటూరు అవడంతో రోజంతా ఆటలే ఆటలు. అందులోనూ ముఖ్యంగా కబడ్డీ, ఖోఖో... ఆడేవాళ్లం. అక్కడ ఏడో తరగతి పూర్తయ్యాక హైదరాబాద్ వచ్చాను. తర్వాత వెస్లీ స్కూల్లో చేరాను. నాతోపాటు ఊరి నుంచి మరికొందరు పిల్లలు కూడా వచ్చారు. గేమ్స్ పీరియడ్‌లో ఇక్కడి వాళ్లు కూర్చుని అదీ, ఇదీ చేస్తుంటే... మా బ్యాచ్ మాత్రం పోటాపోటీగా కబడ్డీ, ఖోఖో ఆడేవాళ్లం. దాంతో పీఈటీ సర్ మమ్మల్ని ప్రత్యేకంగా ఆదరించారు. నేను స్కూల్ నేషనల్స్‌కి కూడా ఆడాను. అప్పుడే మమ్మల్ని శ్రీకృష్ణ కబడ్డీ క్లబ్ వ్యవస్థాపకులు బలరాం యాదవ్ చూశారు. వాళ్ల క్లబ్‌లో చేర్చుకుని ఎంతగానో ప్రోత్సహించారు. తర్వాత కస్తూర్బా కాలేజీలో ఇంటర్మీడియెట్ చేస్తూ కూడా జాతీయ స్థాయిలో ఆడాను. సీనియర్స్ విభాగంలో తొలిసారి తెలంగాణ జట్టుకు సిల్వర్ మెడల్ తీసుకొచ్చాను. ఇవన్నీ చూసి విశాఖ పోర్ట్ ట్రస్ట్ వారు పిలిచి ఉద్యోగం ఇచ్చారు. వాళ్ల టీంలో తెలంగాణ నుంచి ఎంపికైంది నేనొక్కదాన్నే. అప్పుడు మరీ చిన్నదాన్ని అవడం వల్ల ఏడాది మాత్రమే పనిచేసి ఇంటికొచ్చేశాను.

### ఉదాహరణగా చెబుతారు...

హైదరాబాద్ వచ్చాక ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో చేరాను. ఆటను మాత్రం కొనసాగించాను. తర్వాత పెండ్లయింది. ఏడాదికే బాబు, మళ్లీ పాప. పసిపిల్లలు అవడంతో కొన్నాళ్లు ప్రాక్టీస్ చేయలేదు. అప్పుడే రాష్ట్రంలో ఆఫ్రో ఏషియన్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. మహిళా కోచ్‌లకు ప్రాధాన్యం ఉంటుందని తెలియడంతో మావారి సహకారంతో నేను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బెంగళూరులో డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్‌లో చేరాను. నా జీవితంలో అత్యంత కష్ట సమయం అది. రెండు మూడేండ్ల పిల్లలు, భర్తను వదిలిపెట్టి ఎక్కడో దూరంగా ఒక్కదాన్ని ఉండటం. అంతే కాదు, ప్రసవాల కారణంగా ఫిట్‌నెస్‌కి దూరమవడంతో అక్కడ ప్రాక్టీస్ చాలా కష్టమయ్యేది. అక్కడివాళ్లు తొలుత ఈ పిల్లల తల్లి ఎందుకొచ్చింది అన్నట్టు చూశారు. కానీ నాకు వెనక్కి తిరిగి రావడం ఇష్టం లేదు. అందుకే మూడు వారాలపాటు విపరీతంగా కష్టపడి ఫిట్‌నెస్ పెంచుకున్నా. కాలి ఎముకలు బాగా వాచిపోయాయి. కానీ నేషనల్ ప్లేయర్‌గా నా సత్తా ఏంటో ఆ తర్వాతే వాళ్లు చూశారు. ఇంటికి పంపించేద్దాం అనుకున్న అమ్మాయిలో ఇంత ప్రతిభ ఉందా అని ఆశ్చర్యపోయారు. ఇప్పటికీ సాయ్‌లో పాఠాలు చెప్పేప్పుడు నన్ను ఉదాహరణగా చెబుతుంటారని విన్నప్పుడు నా కష్టం వృథా పోలేదు అనిపిస్తుంది.

### గొంతు గుర్తుపడతారు...

అక్కడినుంచి వచ్చాక మన స్టేట్ టీంకి కొన్నేండ్లపాటు కోచ్‌గా పనిచేశా. దాంతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎంఫిల్, పీహెచ్‌డీ... ఇలా చదువుతూ ప్రైవేట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయికి వెళ్లాను. తర్వాత డీఎస్సీ పడటంతో పరీక్షరాసి పీఈటీగా ఎంపికయ్యాను. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన నేను పల్లెటూరి పాఠశాలలో శిక్షణ ఇవ్వడమేంటని ఎప్పుడూ అనుకోలేదు. అదీ ఎంజాయ్ చేశా. దీన్నీ ఆస్వాదించా. ఆటను ఇష్టపడితే ఎక్కడున్నా ఆనందంగా ఉంటాం. అది వంద శాతం నిజం. బడిలో నా శిక్షణను చూసి రాష్ట్రంలోని పీఈటీలకు మీరు కోచింగ్ ఇవ్వాలంటూ నన్ను హైదరాబాద్‌కి పిలిచారు. గత కొన్నేండ్ల నుంచీ ఇక్కడే డిప్యూటేషన్ మీద పనిచేస్తున్నాను. ఇక్కడ చేస్తున్న సమయంలోనే స్టార్ స్పోర్ట్స్ వాళ్లు ప్రొ కబడ్డీ లీగ్‌కి మంచి కమెంటేటర్ కావాలని వాకబు చేయడంతో మహిళా కోచ్‌గా నా పేరు వాళ్లకి చేరింది. తొలి పరీక్షలోనే వాళ్లు నా కామెంటరీ చూసి ఆశ్చర్యపోయారు. అలా ప్రొ కబడ్డీకి తొలి తెలుగు మహిళా కమెంటేటర్‌గా పనిచేశా. ఆ సీజన్‌లు విపరీతంగా హిట్ అవడంతో నా గొంతు కూడా అంతే ఫేమస్ అయింది. చాలామంది గుర్తుపడతారు కూడా. మొత్తం ఎనిమిది సీజన్లకు కమెంటేటర్‌గా పనిచేశా. ఖేలో ఇండియా, తెలంగాణ ప్రీమియర్ లీగ్, కబడ్డీ వరల్డ్ కప్ ఈవెంట్లలో వ్యాఖ్యాతగా వ్యవహరించా. నాకు ఆట మీద పట్టు ఉండటంతో స్టార్ స్పోర్ట్స్ హిందీ, ఇంగ్లిష్ భాషల కమెంటేటర్లకు నాతో పాఠాలు చెప్పించే వాళ్లు. కబడ్డీకి మంచి ఊపు తీసుకురావడంలో నా గొంతు పాత్ర కూడా ఉండటం గొప్పగా అనిపిస్తుంటుంది.

## వాళ్ల ప్రోత్సాహమే

**ఇప్పుడంటే** నేను కబడ్డీ ప్లేయర్‌ని అని గొప్పగా చెప్పుకొంటున్నారు. కానీ, ఒకప్పుడు కబడ్డీ ఆడతా... అంటే ఒక రకంగా చూసేవాళ్లు. కానీ అలాంటి సమయంలో కూడా మా నాన్న నన్నెప్పుడూ నిరుత్సాహపరచలేదు. స్కూల్లో ఉన్నప్పుడు తెల్లవారుజామున నాలుగు గంటలకు లేచి నన్ను లేపి ప్రాక్టీస్‌కి తీసుకెళ్లే వారు. ప్రత్యేకంగా ఆహారం పెట్టేవారు. ఏ పనిచేసినా 'నీకేంది బిడ్డా... తిరుగులేదు' అని ప్రోత్సహించేవారు. మా వారూ అచ్చం అలాగే దొరకడం నా అదృష్టం. నా ప్రతి అడుగులో ఆయన ఉంటారు. ఆయన ప్రోత్సాహం ఉంటుంది. మా పిల్లలూ అంతే సపోర్ట్ చేస్తారు. ఆడపిల్లను కాబట్టి ఇలా... అని నాకెప్పుడూ అనిపించలేదు. అందుకే నేను కూడా నా పిల్లలు, నేను పాఠాలు చెప్పే పిల్లలు ఎవరి దగ్గరైనా ఆడామగా తేడా చూపించను. కోచింగ్‌లోనే కాదు, బెంచీలు పట్టాలన్నా, కోర్ట్‌లో మార్కింగ్‌లు చేయాలన్నా... అన్నిటా ఆడపిల్లలు ఉండాల్సిందే అని చెబుతాను. వాళ్లకెప్పుడూ మినహాయింపు ఇవ్వను. మనం సమానత్వం కోరుకుంటున్నప్పుడు అన్నిటా సమానంగా ఉండాల్సిందే. అప్పుడే మనం విజయం సాధించగలం.



... లక్ష్మీహరిత ఇంద్రగంటి

📷 గడసంతల శ్రీనివాస్

# సాయం చేయనిద్దాం..

పిల్లల విషయంలో తల్లిదండ్రులకు ఆకాశమంత అంచనాలు ఉంటాయి. వారు ప్రయోజకులు కావాలని ప్రణాళికాబద్ధంగా ఎన్నో చేస్తుంటారు. ఈ క్రమంలో వారిని ఒత్తిడికి కూడా గురిచేస్తుంటారు. అంతేకాదు, స్వేచ్ఛగా తిరగనివ్వరు కూడా. దాంతో పిల్లలు తల్లిదండ్రుల మాట వినకపోవడం, క్రమశిక్షణ కారణంగా యాక్టివ్‌గా లేకపోవడం లాంటివి గమనించొచ్చు. కఠిన నియమాల్లో పెరిగిన పిల్లలు పెద్దయ్యాక కొరకరాని కొయ్యల్లా తయారయ్యే ప్రమాదం ఉంది. అందుకే, పిల్లల విషయంలో తల్లిదండ్రులు పట్టువిడుపులు ప్రదర్శిస్తేనే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు పరిచినవారు అవుతారు.



**పాజిటివ్ ఆలోచనలు:** పిల్లల్లో ముందుగా పాజిటివ్ ఆలోచనలను పెంపొందించాలి. చదువు, ఆటలు ఇలా ఏ అంశంలోనైనా వారిని ప్రోత్సహించాలి. వారికి ఎందులో ఆసక్తి ఉందో గమనించి.. ఆ దిశగా వెన్నుతట్టాలి. మార్కులు సరిగ్గా రావడం లేదని మందలించడం కన్నా.. చదువు ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ నాలుగు మంచిమాటలు చెబుతూ వారిని నిదానంగా దారిలోకి తెచ్చుకోవాలి.

**సహాయపడే గుణం:** తల్లిదండ్రుల గుణగణాలు పిల్లలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. మీరు స్వార్థంగా ఉంటూ.. పిల్లలకు నిజాయతీగా ఉండాలని బోధిస్తే ఫలితం ఉండదు. సాయం చేసే లక్షణం మీలో ఉన్నప్పుడే.. అది పిల్లలకు చెప్పకుండానే అలవడుతుంది. మీరు అపాత్రదానం చేస్తే.. వాళ్లూ అలాగే తయారవుతారు. ఎవరికి సాయం చేసినా, ఎందుకు చేస్తున్నాం, సాయం పొందిన వారి అవసరం ఎంత విలువైనదో తెలియజెప్పాలి. అప్పుడే నలుగురికీ సాయం చేసే లక్షణం మీ పిల్లల్లో పెంపొందుతుంది.

**బాధ్యతలు అప్పగించాలి:** పిల్లలు ఎదుగుతున్న కొద్దీ వారిని చదువుకోమని చెబుతూ ఉంటాం. చదువుతోపాటు ఇంట్లో చిన్నచిన్న పనులు వాళ్లకు అప్పగించాలి. ఆ పని పూర్తిచేసే బాధ్యత వారిదేనని చెప్పాలి. దానివల్ల పిల్లల్లో కృషి, పట్టుదల పెరుగుతాయి.

**ఫోకస్ ముఖ్యం:** ఏ పని మొదలుపెట్టినా దానిని సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేయాలని పదేపదే చెబుతూ ఉండాలి. ఫోకస్ పెట్టి చేస్తే పూర్తికాని పని ఏదీ ఉండదని చెప్పాలి. ఒక గోల్ పెట్టుకుని ప్లాన్ చేసి దానిని సాధించడం అలవాటు చేయాలి. అంతేకాదు, ఏ విషయాన్నయినా తల్లిదండ్రులతో పంచుకునే స్వేచ్ఛ ఇవ్వాలి.